








విద్యావ్యవస్థను తీర్చిదిద్దుతాం

● మెగా పీటీఎం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం ● పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్

ఇందిరాగాంధీ మెమోరియల్ హై స్కూల్‌లో విద్యార్థిని నృత్య ప్రదర్శన

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో గాడితప్పిన విద్యావ్యవస్థను మంచిగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ కలిసేందుకు మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ గొప్ప వేదికగా నిలిచిందన్నారు. శనివారం కర్నూలు జిల్లా కేంద్రంలోని ఏ.క్యాంపు ఇందిరాగాంధీ మెమోరియల్ హై స్కూల్‌లో జరిగిన మెగా పీటీఎం ఆత్మీయ సమావేశానికి మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు అందరూ కలిసి సమావేశం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశం ద్వారా పాఠశాలల్లో సమస్యలు తెలుస్తాయనీ, పిల్లలు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులకు తెలుస్తుందన్నారు. గాడి తప్పిన విద్యావ్యవస్థను అభివృద్ధి దశలో పెట్టేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేరెంట్స్, టీచర్స్, పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలల్లో అభివృద్ధితో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రోత్సాహించాలని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లల గురించి ఏదైనా సమస్య ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టు, వారి ఆరోగ్యం గురించి ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు నైతిక విలువల సలహాదారుగా ప్రభుత్వం నియమించిందన్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. వారితో మాట్లాడి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. కొంత మంది తల్లిదండ్రులు హాస్టల్ వసతి సరిగ్గా లేదని, పరిశుభ్రమైన తాగునీరు అందించడం లేదని, పరిసరాలు శుభ్రంగా లేవని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నింటిని నెలలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌ను మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. ఇదే పాఠశాలలో చదివి ఆర్‌బీఐలో ఉద్యోగం చేస్తున్న అఖిలశ్రీ అనే విద్యార్థిని మంత్రి టీజీ భరత్ అభినందించారు. అనంతరం డ్రగ్స్ నివారణపై అవగాహన పోస్టర్లను మంత్రి విద్యార్థులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో హనుమంతరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్



హాజరైన తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు

జాతీయ సైక్లింగ్ పోటీలకు ప్యాపిలి విద్యార్థిని



సైక్లింగ్‌లో పోటీల్లో పాల్గొన్న వెంకటేశ్వరి

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ప్యాపిలి మండలంలోని జడ్పీహెచ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం. వెంకటేశ్వరి ఎంపికైంది. నవంబరు 30న గుంటూరు జిల్లాలో జరిగిన అంతర్‌జిల్లా సైక్లింగ్ ఎంపిక పోటీల్లో వెంకటేశ్వరి ఉత్తమ ప్రతిభ కనపరిచింది. దీంతో 9, 10 తేదీల్లో ఒడిశాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.విజయలక్ష్మి, కోచ్ బి.జయగణపతి తెలిపారు.

కోర్టు కేసులపై సకాలంలో స్పందించాలి

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసులపై సకాలంలో స్పందించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసుల్లో జాప్యం ఉండకూడదని, నిబంధనల మేరకు సకాలంలో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కోర్టు కేసులను పర్యవేక్షించేందుకు డివిజనల్ స్థాయిలో అధికారులను నియమించాలని ఆర్డీవోలు, డీఆర్వోలను ఆదేశించారు. కేసులకు సంబంధించి హాజరు కావాలని తహసీల్దార్లకు నోటీసులు జారీ అయితే.. ఖచ్చితంగా కోర్టుకు వెళ్లాలని అన్నారు. రెండు వారాలకు ఒకసారి డివిజన్ స్థాయిలో లా ఆఫీసర్ల సమావేశం నిర్వహించేలా ఆర్డీవోలకు ఆదేశాలు జారీ చేయాలని డీఆర్వోను కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారిగా కేసుల వివరాలను సంబంధిత శాఖల అధికారులకు ముందుగానే అందజేయాలని, జీపీ, ఏజీపీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, జిల్లా కోర్టు జీపీ ఆనందరావు, ఆలూరు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు ఏజీపీ, ఎమ్మిగనూరు కోర్టు ఏజీపీ, ఆదోని సీనియర్ సివిల్ జడ్జీ కోర్టు ఏజీపీ, పత్తికొండ జూనియర్ కోర్టు ఏజీపీలు, సీసెక్షన్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.



వైభవం అగసనూరు ఆంజనేయస్వామి రథోత్సవం

కోసిగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలోని అగసనూరు గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి రథోత్సవం కోలాహలంగా జరిగింది. రథోత్సవం సందర్భంగా దొడ్డి, బెళగల్, చిన్నభోంపల్లి, పెద్దభోంపల్లి దుద్ది, కోల్‌మాన్‌పేట తదితర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా ఆంజనేయస్వామికి కార్తీకమాస పూజలు నిర్వహించి స్వామివారిని రథంపై తీసుకొచ్చారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. కాగా స్వామివారిని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డిలు దర్శించుకున్నారు.



భక్తుల మధ్య ఊరేగుతున్న రథోత్సవం

కర్నూలులో ఈగల్ చీఫ్

కర్నూలు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఈగల్ చీఫ్, ఐజీ ఆకే రవికృష్ణ శనివారం కర్నూలుకు వచ్చారు. దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల పర్యటనలో భాగంగా ఆయన స్థానిక పోలీసు అతిథి గృహానికి చేరుకున్నారు. కర్నూలు వచ్చిన ఈయనను డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ బిందుమాధవ్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, నగరంలోని పలువురు సీఐలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఈగల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌పై, డ్రగ్స్ కంట్రోలింగ్ తదితర అంశాలపై ఎస్పీ బిందుమాధవ్‌తో ఐజీ చర్చించారు. త్వరలోనే కర్నూలులో ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఐజీని కలిసిన వారిలో సీఐలు శ్రీధర్, మురళిధర్ రెడ్డి, శేషయ్య, మన్సూరుద్దీన్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఐజీకి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌బీ సీఐ ప్రసాద్

అమృత్ పథకం పనులు పూర్తి చేయించండి

కమిషనర్‌కు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ లేఖ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అమృత్ 2016-20 సంబంధించి పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం పబ్లిక్ హెల్త్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు లేఖ రాశారు. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ హైదరాబాద్‌కు సంబంధించిన సంస్థకు ఇచ్చిన అగ్రిమెంట్ ఈ నెల 31కు పూర్తవుతుందన్నారు. అయితే మిగిలిన పనులు పూర్తి చేసేందుకు 2025 మార్చి చివరకు ఉంటుందన్నారు. గడువు పూర్తయ్యే లోపల మిగిలిన పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ లేఖలో పేర్కొన్నారు. అమృత్ పథకానికి సంబంధించి ఇన్‌వెస్టిగేషన్, సర్వే డిజైన్, ప్రిపరేషన్ ప్లాన్స్, డ్రాయింగ్స్, హైడ్రాలిక్ డిజైన్లు, స్ట్రక్చరల్ డిజన్స్, డిటైయిల్డ్ ఎస్టిమేషన్స్ తదితర వాటిని నివేదించాలని సూచించారు.

56 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు

మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి



ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇప్పటి వరకు ఆదోని వ్యవసాయ మార్కెట్ పరిధిలో 56,273 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసిందని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం తన చాంబర్లో ఆయన సీసీఐ కొనుగోలుపై మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి గింజల ధరలు తక్కువగా ఉన్నందు వల్ల స్థానిక మార్కెట్‌లో వ్యాపారులు పత్తిని కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొంటున్నారని, రైతులు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని అన్నారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7521కు సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. గత 15రోజుల నుంచి 2,523 మంది రైతుల నుంచి సీసీఐ పత్తి కొనుగోలు చేసిందన్నారు. పత్తి కొన్న వారం రోజుల్లోనే సీసీఐ నేరుగా రైతుల ఖాతాలో డబ్బు జమ చేస్తున్నదని అన్నారు. రైతు సేవా కేంద్రాలలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఈ మేరకు నిబంధనలు సడలించినట్లు ఆయన తెలిపారు.

బలమైన బంధాలతోనే విద్యా వికాసం
కలెక్టర్ రంజిత్ బాషా 6లో

మంత్రాలయంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ
● ఉచితంగా నిర్మించేందుకు ముందుకు వచ్చిన టాటా కంపెనీ
● భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన పీఠాధిపతి

13వరకు బీఈడీ స్పాట్ అడ్మిషన్లు
వివరాలు 6లో
జడ్పీలో కారుణ్య నియామకాలు

ఓపీ రోగులకు ఆ.భా ఐడీ తప్పనిసరి

వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ డా.బి. రామగిడ్డయ్య

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓపీ రోగులకు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ ద్వారా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆ.భా.) ఐడీ తప్పనిసరి అని కడప వైద్య ఆరోగ్య శాఖ రిజనల్ డైరెక్టర్ డాక్టర్ బి. రామగిడ్డయ్య తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని ఎన్టీఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని కడప ఆర్డీ తనిఖీ చేశారు. ఆబా కార్డు ద్వారా రోగికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించాలని ఆదేశించారు. చికిత్స వివరాలను పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడు చేయాలని ఆదేశించారు. అసంక్రమిత వ్యాధుల సర్వే, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సర్వే, మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో వైద్యాధికారులు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ఉమ, డీపీవో విజయరాజు, యూపీహెచ్‌సీ ఎన్టీఆర్ కాలనీ వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న కడప ఆర్డీ డా.బి.రామగిడ్డయ్య

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశభవనంలో ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసనసభ్యులు, హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, విద్యుత్ శాఖలపై చర్చ ఉంటుందన్నారు. అదేవిధంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 1,2వ స్థాయీ సంఘాల సమావేశాలు మినీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.


పుచ్చకాయలమడకు హంద్రీ నీవా నీరు



హంద్రీనీవా కాలువ నుండి నీటిని లిఫ్ట్‌చేసే ప్రాంతం

- 6.5 కోట్ల అంచనాలతో డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపిన ఇరిగేషన్ శాఖ
- హంద్రీ నీవా 121 కిలోమీటర్ వద్ద పంపింగ్ హౌస్
- 2 ఎకరాల విస్తీర్ణం చొప్పున 3మినీ స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణం
- డెలివరీ ఛానల్ నుండి గ్రావిటీ ద్వారా స్టోరేజ్ ట్యాంకులకు నీరు మళ్లింపు
- ముఖ్యమంత్రి హామీ అమలుకు రంగం సిద్ధం చేస్తున్న అధికారులు

పత్తికొండ, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): పుచ్చకాయలమడ గ్రామానికి హంద్రీ నీవా నీటిని మళ్లించేందుకు ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు రంగం సిద్ధం చేస్తున్నది. అక్టోబరు 1న పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గ్రామానికి వరాలజల్లు కురిపించారు. స్వర్ణగ్రామంగా పుచ్చకాయలమడను అభివృద్ధి చేస్తామని సాగు, తాగునీరు గ్రామానికి అందిస్తామన్నారు. వర్షాధార పంటపొలాలకు హంద్రీనీవా ద్వారా సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి హామీకి సంబంధించి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ పుచ్చకాయలమడ గ్రామానికి ఎత్తిపోతల ద్వారా హంద్రీనీవా నీటిని అందించేందుకు సర్వేలు పూర్తిచేసి (డీపీఆర్)డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టును ప్రభుత్వానికి పంపింది.



నీటి మళ్లింపునకు సంబంధించి ఆన్‌లైన్ మ్యాప్

హంద్రీనీవా 121.5 కిలోమీటర్ వద్ద పంపింగ్ హౌస్..

పుచ్చకాయలమడ - హోసూరు రహదారిలో ఉన్న హంద్రీ నీవా ప్రధానకాలువ 121.5 కిలోమీటర్ వద్ద పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడి నుండి 3.5 కిలోమీటర్ల దూరంలో నిర్మించనున్న డెలివరీ ఛానల్‌కు నీరు ఎత్తిపోస్తారు. అందుకోసం పంప్‌హౌస్ నుండి డెలివరీ ఛానల్ వరకు పైప్‌లైన్‌ను నిర్మించి నీటిని ఎత్తిపోస్తారు.

మూడు మినీ వాటర్ స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణం

హంద్రీ నీవా ప్రధాన కాలువ పంప్‌హౌస్ నుండి పైప్‌లైన్ ద్వారా డెలివరీ చానల్‌కు ఎత్తిపోసిన నీటిని మూడు గ్రావిటీ పైప్ లైన్ల ద్వారా(కాలువల ద్వారా) మినీ వాటర్‌స్టోరేజ్ ట్యాంకులకు మళ్లిస్తారు. అందుకోసం గ్రామానికి మూడువైపులా ఒక్కో వాటర్ స్టోరేజ్ ట్యాంక్ 2ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తారు. పుచ్చకాయలమడ గ్రామం నుండి పత్తికొండ రహదారి వైపు ఒకటి, పెరవలి రహదారి వైపు ఒకటి, హోసూరు రహదారి వైపు ఒకటి చొప్పున నిర్మించిన వాటర్ స్టోరేజ్ ట్యాంకులకు నీరు నింపి అక్కడి నుండి పొలాలకు పిల్లకాలువల ద్వారా సాగునీటిని అందిస్తారు.



పుచ్చకాయలమడ గ్రామం


133 ఏళ్ల ఎస్పీజీ చర్చి

● నేటికీ చెక్కు చెదరని నిర్మాణం ●నంద్యాల జిల్లాలోనే తొలి చర్చి



రెండీ షెప్పర్డ్ దొర సమాధి


చాగలమర్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎందరో విశ్వాసులకు ప్రార్థన నిలయంగాను, ప్రార్థించిన విశ్వాసుల హృదయాలకు శాంతి, కరుణ, జాలి అందించే కేంద్రంగా బాసిల్లుతోంది చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు ఎస్పీజీ చర్చి. పురాతనమైన చర్చిగా పేరొందిన ప్రార్థనా మందిరం ఆదివారంతో 133 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. అత్యంత సుందరంగా నిర్మించిన ఈ చర్చి నేటికీ చెక్కు చెదరని కట్టడంగా చరిత్రలో నిలిచిపోయింది. 133 వసంతాలు పూర్తి చేసుకున్న ఎస్పీజీ చర్చిలో ఆది, సోమవారాల్లో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎస్పీజీ సంఘ స్థాపనకు ముత్యాలపాడు గ్రామం పునాది. జిల్లాలోనే మొదటగా ఇక్కడ చర్చి నిర్మించి సువార్త సేవను ప్రారంభించారు. 1852వ సంవత్సరంలో అల్‌ఫ్రెడ్‌ఉడ్ ఈ ప్రాంతానికి ప్రథమ మిషనరీగా వచ్చి 30 మందికి బాప్తిజం ఇచ్చినట్లు చరిత్ర చెబుతుంది. అదే సంవత్సరంలో రెవరెండ్ జాన్‌క్లై దొర రెండో మిషనరీగా వచ్చి 1852లో ఒక బావి తవ్వించారు. సువార్త సేవ చేస్తూనే భార్య, కుమారుడిని ఆయన కోల్పోయారు. 1855లో రాయలసీమలోనే మొదటగా చర్చి నిర్వహణలో ప్రాథమిక పాఠశాల, వైద్యశాల నిర్మించారు. ఇంగ్లాండ్ దేశానికి చెందిన రెవడెండ్ షర్ దొర 1877 నవంబర్‌లో ముత్యాలపాడుకు వచ్చి దేవుడి సేవ ప్రారంభించారు. 1984లో మద్రాసు అధ్యక్ష బిషప్ రైట్ రెవ ఫెడరిక్‌జెల్ ద్వారా చర్చి నిర్మాణానికి పునాది రాయి వేశారు. ముత్యాలపాడు నుంచే రెండీ షెప్పర్డ్‌దొర కర్నూలు-కడప జిల్లాలో సువార్త సేవ వ్యాప్తి చేశారు. ఆయన నివాస భవనంగా నిర్మించుకున్న బంగ్లా నేడు ఎస్పీజీ ఉన్నత విద్యాలయ భవనంగా మారింది. 1912 సంవత్సరంలో ఆయన కన్నుమూశారు. నేటికీ ముత్యాలపాడు చర్చి ఆవరణలో ఆయన సమాధికి ప్రార్థనలు జరుగుతూనే ఉన్నాయి.



చర్చికి పునాది వేసిన ఇంగ్లండ్ దేశీయుడు రెండీ షెప్పర్డ్ దొర చిత్రపటం

రెండు రోజుల పాటు చర్చి వార్షికోత్సవం

133 ఏళ్ల వసంతాలు పూర్తి చేసుకున్న ఎస్పీజీ చర్చిలో 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీనరీ ఛైర్మన్ సంజీవరాజ్ తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన ఎస్పీజీ చర్చి వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 8న చర్చిలో ప్రభు సంస్కారపు ఆరాధన, కర్నూలుకు చెందిన ప్రసన్నకుమార్‌బాబుచే దీపారాధన, 9న నంద్యాల ఎస్పీజీ డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఊరేగింపు, చర్చి ప్రతిష్ఠ ఆరాధన జరుగుతుందని తెలిపారు.



133 ఏళ్ల చరిత్రగల ముత్యాలపాడు ఎస్పీజీ చర్చి

మంత్రాలయంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ

● ఉచితంగా నిర్మించేందుకు ముందుకు వచ్చిన టాటా కంపెనీ

● భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన పీఠాధిపతి



అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళికను పరిశీలిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి ప్రముఖ టాటా కంపెనీ ముందుకు వచ్చింది. శనివారం టాటా కంపెనీ అధికార ప్రతినిధి చంద్రశేఖర్, ప్రణాళిక ఇంజనీర్ రంగనాథ్ ఆధ్వర్యంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ శ్రీమఠంతో పాటు మంత్రాలయంలో ప్రధాన కాలనీలను కలుపుతూ దాదాపు 2 కి.మీల మేర రూ.13 కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు టాటా కంపెనీ ఉచితంగా చేపట్టిందన్నారు. వచ్చే ఏడాది జూన్‌లోపు పనులు పూర్తి చేసేందుకు టాటా కంపెనీ యజమాన్యం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మఠం ఈఈ, మఠం మేనేజర్-సి సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్‌చార్, పవనాచార్ పాల్గొన్నారు.

బలమైన బంధాలతోనే విద్యా వికాసం

● పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య బలమైన బంధాలు ఏర్పడితేనే విద్యా వికాసం సాధ్యమని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. శనివారం స్థానిక కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న డా. ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను జరుపుతున్నదని అన్నారు. జిల్లాలో 147 పాఠశాలల్లో మెగా టీచర్స్ మీటింగ్ జరుపుతున్నట్లు వివరించారు. విద్యారంగంలో పలు సంస్కరణలు తేవాలని సీఎం, విద్యాశాఖ మంత్రి సంకల్పించారన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధత, అంకితభావంతో పని చేస్తే తల్లిదండ్రులకు నమ్మకం, భరోసా కలుగుతాయని అన్నారు.

● **రాష్ట్ర స్థాయిలో అవార్డులు :** ఉపాధ్యాయులు చేసిన కృషి వల్ల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో అవార్డులు వచ్చాయని కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు పొందిన పాఠశాలగా జిల్లాకు గుర్తింపు తెచ్చిందన్నారు. మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ గౌసియా, టూటౌన్ సీఐ విజయకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న కలెక్టర్

పిల్లల చదువుపై శ్రద్ధ వహించాలి

కలెక్టర్ రాజకుమారి

బేతంచెర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పిల్లలు చదువుకొని భవిష్యత్తులో రాణించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజకుమారి హాజరై మాట్లాడారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కలెక్టర్‌గా మీ ముందుకు వచ్చానన్నారు. పిల్లలతో కొంత సమయం గడుపుతూ సరైన మార్గంలో నడిపించాలన్నారు. ఏపీ ఆదర్శ పాఠశాలలో ముఖ్య అతిథులుగా డోన్ డీఎస్పీ శ్రీనివవాసులు, సీఐ వెంకటేశ్వర రావు హాజరు కాగా, ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు తమ భవిష్యత్తుకు ఉజ్వల బాటలు వేసుకోవాలని సూచించారు. అలాగే కేజీబీవీ పాఠశాలలో బాలికల అభివృద్ధి అధికారి సువర్చల పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు సోమశేఖర్, పురుషోత్తంరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సర్పంచ్ రాజు, హెచ్ఎంలు మల్లికార్జున, ప్రిన్సిపాల్ మరియదాసు, అబుదాబి బేగం, కౌన్సిలర్ రామ్మూర్తి, షేక్షావలి చౌదరి, విద్యాకమిటీల ఛైర్మన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

13 వరకు బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ బీఈడీ కళాశాలలో రెండు ఏళ్ల కోర్సులో భర్తీ కాకుండా మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆర్ నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ క్యాంప్‌లోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో ఈనెల 8 నుంచి 13 వరకు ఏపీఎస్‌సీహెచ్‌ఈ మార్గదర్శకాల ప్రకారం 2024 సంవత్సంరలో ఏపీ ఎడ్ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మాత్రమే అడ్మిషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 939869207నంబరును సంప్రదించాలని సూచించారు.

జడ్పీలో కారుణ్య నియామకాలు



నియామకపత్రాలు అందజేస్తున్న ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో ఖాళీగా ఉన్న నాల్గవ తరగతి ఉద్యోగాల పోస్టులను కారుణ్యనియామకం కింద భర్తీ చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం జడ్పీ కార్యాలయంలో ఛైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి, సీఈవో జి.నాసరరెడ్డి ముగ్గురు ఉద్యోగులకు నియామ కపత్రాలను అందజేశారు. జ్యోతి ప్రసాద్‌ను నంద్యాల జిల్లా దొర్నిపాడు జడ్పీ ఉన్న పాఠశాల, హెచ్‌ఎస్.హారూన్ రషీద్‌ను ఆళ్లగడ్డ మండల ప్రజాపరిషత్తు కార్యాలయం, పి.అన్వర్ బాషను జిల్లా పరిషత్ పరిపాలన భవనానికి నియమించారు.

నటనలో మేటి ..

కళ

● 250 నాటకాలలో నటించిన కళాకారుడు

● చింతామణి నాటకంలో భవాని పాత్రకు పెట్టింది పేరు

● టీడీపీ సాంస్కృతి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా

● కౌలుట్లయ్యనాయుడి ప్రతిభాపాటవం

గోనెగండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయనకు చిన్నతనం నుంచి నాటకాలు అంటే ఎంతో ఇష్టం. ఉన్నత విద్య అందకపోయిన, ఆర్థికంగా ఎదగక పోయినా నాటకాలలో అవకాశం లభిస్తే చాలు వివిధ ప్రాతలు ధరిస్తు ప్రజలు, కళాకారులు, కళాభిమానుల మన్నలు పొందుతుంటాడు. ఆయన నాటక రంగంలోని ప్రతిభను చూసి జిల్లా టీడీపీ సాంస్కృతి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపి చేసింది. ఆయనే గోనెగండ్లకు చెందిన కళాకారుడు కౌలుట్లయ్యనాయుడు. రంగస్థలంలో మేటి నటుడిగా రాణిస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు 250 నాటకాలలో నటించిన కళాకారుడు. చింతామణి నాటకంలో భవాని పాత్రకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలో చింతామణి నాటకం ఉంది అంటే భవాని పాత్రలో కౌలుట్లయ్యనాయుడు ఉన్నడని అర్థం. అంతగా పాత్రలో ఒదిగి పోతాడు. అలాగే రాముడు, కృష్ణుడు, అర్జునుడు, నక్షత్రకుడు, ఇలా ఏ పాత్రలోనైనా అలవోక గా ఒదిగి పోతాడు. స్థానిక నాటకాలలో నే గాక ఎమ్మిగనూరు, నందవరం, కర్నూలు, నంద్యాల, గిద్దలూరు, మంత్రాలయం తదితర ప్రాంతాలలో పలు నాటకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలు మార్లు ఉన్నతాధికారులు సన్మానాలు కూడా చేశారు. కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తే మరింత ముందుకు పోతారని ఆయన అంటున్నాడు.



భవాని పాత్రలో కౌలుట్లయ్యనాయుడు



అధికారులు కౌలుట్లయ్యనాయుడిని సన్మానిస్తున్న దృశ్యం





అర్జునుడి పాత్రలో

బడికి పోవాలంటే.. బురద తొక్కాల్సిందే..!



యు. బొల్లవరం పాఠశాల ఎదుట బురదగుంటగా మారిన రహదారి

మహానంది, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా.. బురదమయంగా కనిపిస్తున్న ఈ రోడ్డు మహానంది మండలం యు.బొల్లవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లే దారి. రోడ్డు అధ్వానంగా ఉన్న ఈ దారిలోనే విద్యార్థులు నిత్యం పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. చిన్నపాటి వర్షం కురిసినా చాలు మొత్తం బురదమయంగా మారి వెళ్లడానికి ఏమాత్రం వీలుగా ఉండదు. గ్రామంలో ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించినప్పటికి ఇరుప్రక్కల డ్రైనేజీ నిర్మించకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. ఇళ్లలోని మురుగుతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. అటువైపు వెళ్ళే ప్రజలు సైతం అతి కష్టం మీద వెళ్తున్నారు. శనివారం మెగా పేరెంట్స్, టీచింగ్ మీటింగ్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు అధికారులు సైతం అదే దారిలోనే ఆపసోపాలు పడుతూ వెళ్లారు.



స్నాతకోత్సవానికి గవర్నర్ రాక

• ఫిబ్రవరి 8న కార్యక్రమానికి ఏర్పాట్లు
• క్లస్టర్ వర్సిటీ ఉప కులపతి డీవీఆర్ సాయిగోపాల్


మాట్లాడుతున్న క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి

కర్నూలు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 8న నిర్వహించనున్న మొదటి స్నాతకోత్సవానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్నాతకోత్సవానికి సంబంధించి జనవరి 8లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2021-22 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 770 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరికి ఇప్పటికే సమాచారం అందించామన్నారు. వర్సిటీ వెబ్ సైట్‌లో వివరాలు తెలుసుకోవాలని సూచించారు. స్నాతకోత్సవ సదస్సులో గవర్నర్ సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డు, గోల్డ్ మెడల్, పారితోషికం వంటివి ప్రోత్సాహకాలుగా అందజేయడానికి దాతలు, విద్యావేత్తలు, పూర్వవిద్యార్థులు, వివిధ సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఓఎస్‌డీ డాక్టర్ ఎస్ఎం బాషా, పీఆర్‌వో డాక్టర్ పార్వతి దేవి, ఏపీఆర్‌వో డాక్టర్ వింధ్యా వాసిని పాల్గొన్నారు.

భయపెడుతున్న ధరలు


కూరగాయలు కొంటున్న వినియోగదారుడు

ఆలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యులు కిరాణ షాపులకు, కూరగాయల మార్కెట్‌కు వెళ్లాలంటే భయపడు తున్నారు. ఒక రోజు ఉన్న ధరలు మరుసటి రోజు ఉండటం లేదు. చేతిలో ఉన్న డబ్బులకు ఏది కొనాలో, ఏది మానేయాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పూట గడవడం కష్టంగా మారింది. బియ్యం, పప్పులు, నూనెలు, కూరగా యలు, చికెన్, కోడిగుడ్లతో సహా అన్నీ అందనంతగా ధరలు పెరిగాయి.

సామాన్యులపై పెనుభారం

పెరిగిన బియ్యం, వంట నూనెలు, కూరగాయల ధరలు

వంటింట్లో ధరల మంట

వంటింట్లో ప్రతి పూట అత్యవసరమైన బియ్యం ధరలు పెరిగిపోయాయి. సోనా మసూరి బియ్యం కేజీ రూ.70కు చేరుకుంది. ఎండిల్ సోనా రూ.55-65ల వరకు అమ్ముతున్నారు. కందిపప్పు కేజీ రూ.180లకు చేరింది. మినపపప్పు రూ.140, పెసరపప్పు రూ.140లకు చేరుకున్నాయి.

కొనేలా లేని వంట నూనెలు

కేంద్ర ప్రభుత్వం వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో వంటనూనె ధరలు కేజీకి గత రెండు నెలల్లోనే రూ.30 పెరిగాయి. వేరుశనగ నూనె కేజీ రూ.200, సన్‌ఫ్లవర్ రూ.160, నువ్వులనూనె రూ.480, కొబ్బరి నూనె లీటరు రూ.360లకు చేరింది.



ధరలు తగ్గించాలి



మార్కెట్‌లో పెరిగిన అన్ని రకాల నిత్యావసరాలు, కూరగాయల ధరల తగ్గింపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. రూ.500లు మార్కెట్‌కు తీసుకెళ్తే 5రకాల వస్తువులు రావడం లేదు. గుడ్లు, చికెన్, మటన్, ధరలు అమాంతంగా పెరిగాయి.
- పాన్ వీరేష్, ఆలూరు

ఆకాశాన్నంటుకున్న కూరగాయలు

నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు. ప్రతిరోజూ వంటల్లో వాడే ఉల్లిపాయలు, టమోటా ధరలు మోత మోగిస్తున్నాయి. మూడు నెలల నుంచి ఉల్లిపాయలు కేజీ రూ.60పైమాటే. ప్రతి కూరలో వాడే టమోటాలు రూ.50కి చేరుకున్నాయి. వంకాయలు కేజీ రూ.50, బీరకాయలు రూ.60, క్యారెట్ రూ.70 పలుకుతున్నాయి. బెండ, దొండకాయలు రూ.40పైమాటే. ఎన్నడూ లేనంతగా దోసకాయలు, అనపకాయలు, పొట్లకాయలు కూడా రూ.30-40 పలుకుతున్నాయి. చిక్కుళ్ళు రూ.80కి పెరిగాయి. ఆకు కూరలు కట్ట రూ.20 తక్కువ లేదు. అక్టోబరు మాసంలో వచ్చిన వానలు, వరదలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గి ధరలు పెరిగిపోయాయి. కార్తీక మాసం రావడంతో ధరలు మరింత పెరిగాయి. కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.240కి చేరింది. కోడి గుడ్డు రూ.5నుంచి రూ.7.50 పైసలు వరకు పెరిగింది. మటన్ రూ.800లకు చేరుకుంది. వెల్లుల్లి ఐదు నెలల క్రితం కేజీ రూ.150లు ఉండగా ఇప్పుడు కిలో రూ.400లకు అమ్ముతున్నారు.

సామాన్యుడు బతకలేని పరిస్థితి



అన్ని రకాల ధరలు విపరీతంగా పెరగటంతో ప్రజల బతుకు ప్రశ్నార్థకమైంది. కూరగాయల దగ్గర నుంచి ఉప్పులు, పప్పులు, బియ్యం, చింతపండు ఇలా ఒకటేమిటి సామాన్యులకు ఏవీ అందుబాటులో లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. దళారీ వ్యవస్థ కారణంగా ధరలు విపరీతంగా పెరిగాయి. - గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

తుంగభద్రలో మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం రైలు నుంచి కిందపడిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభించింది. రైల్వే ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న గుంటూరు నుంచి కాచిగూడకు వెళ్లిన రైలులో ప్రయాణించిన గుర్తుతెలియని వ్యక్తి తుంగభద్ర నదిలో పడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పోలీసులు మృతదేహం కోసం గాలించగా శనివారం బయట పడింది. మృతుడి వయస్సు 40 ఏళ్ల ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి శరీరంపై ఎరుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు.

బైకుల ఢీ : ఒకరి పరిస్థితి విషమం

ఆదోని రూరల్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసాపురం ఎల్లెల్సీ గట్టుపై రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన అయ్యప్ప కొన్ని సంవత్సరాలుగా బసాపురంలో ఉంటూ, గొర్రెలను మేపుతున్నారు. శనివారం బైక్‌పై ఎల్లెల్సీ గట్టుమీదుగా గొర్రెల వద్దకు వెళ్తుండగా, మరోవైపు బెలగాంకు చెందిన గొర్రెల కాపరి బైక్ అయ్యప్పను ఢీకొంది. అయ్యప్ప కాలు విరగడంతో ఆదోని ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. ఇస్వీ పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

వాహనంపై విరిగిపడ్డ వృక్షం

• స్వల్ప గాయాలతో బయటపడ్డ డ్రైవర్


వాహనంపై విరిగిపడిన చెట్టు

మిడుతూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామ సమీపంలోని నాగలూటి గ్రామ రహదారిలో పొలం వద్ద ఉన్న తుమ్మచెట్టును ఎర్రగుట్ల నుంచి పైపాలెం సోలార్ పనులకు వెళ్తున్న వాహనం శుక్రవారం రాత్రి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మధు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వాహనం ఢీ కొట్టడంతో చెట్టు విరిగి రహదిరికి అడ్డంగా పడిపోయింది. శుక్రవారం రాత్రి నుంచి వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. పోలీసులు శనివారం ఘటనా స్థలాకి చేరుకుని రహదారికి అడ్డంగా ఉన్న చెట్టును తొలగించారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి పాము కాటు

• ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి
• పాఠశాలలో ఆత్మీయ సమావేశంలో ఘటన


చికిత్స పొందుతున్న విద్యార్థి విష్ణువర్ధన్

కోసిగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కోసిగి మండలంలోని మోడల్ స్కూల్‌లో కోసిగికి చెందిన 7వ తరగతి విద్యార్థి వడ్ల విష్ణువర్ధన్ పాఠశాల బయట తన స్నేహి తులతో పాటు షూస్ వదిలి వెళ్తుం డగా.. మరో విద్యార్థి షూ నుంచి పాము బయటకు వచ్చి విద్యార్థి విష్ణువర్ధన్ ఎడమకాలుకు కాటు వేసింది. వెంటనే ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, ఉపాధ్యాయులు కోసిగి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటు న్నట్లు తల్లిదండ్రులు శ్రీనివాసాచారి, లక్ష్మిలు తెలిపారు. బడులకు వచ్చిన తల్లిదండ్రుల ఎదుటే తమ కుమారుడుకు పాము కాటు వేయడంతో తల్లిదండ్రులు కన్నీరు పెట్టుకున్నారు. ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణ

రుద్రవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోటకొండ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటు మోహన్‌రాజుపై శనివారం ఉపాధి హామీ పథకం పీడీ జనార్దన్‌రావు ఆదేశాల మేరకు ఏపీడీ సాంబశివరావు శనివారం విచారణ జరిపారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో గ్రామంలో లేని అంగన్‌వాడీ ఆయా, ఆశా కార్యకర్తలకు వేతనాలు ఇచ్చారని స్థానికులు విచారణలో ఏపీడీకి వివరించారు. గ్రామంలో సుమారు 10 మందికి పైగా వ్యక్తులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏపీడీ తెలిపారు.

నల్లగట్లలో ఉద్రిక్తత

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండల పరిధిలోని నల్లగట్లలో ఆస్తి తాగాదాలతో శనివారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. అన్నదమ్ములు రమణ, నాగరాజు మధ్య కొంత కాలంగా ఆస్తి తగాదా ఉంది. సమస్య పరిష్కారం కాకపోవడంతో నాగరాజు భార్య హేమలత, కుమారుడు మాధవ్‌పై అన్న రమణ, కుటుంబసభ్యులు దాడి చేశారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం నిమిత్తం వారిని నంద్యాలకు తరలించారు. ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం: ఎమ్మెల్యే బుడ్డా


పార్నపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

బండిఆత్మకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. పార్నపల్లె గ్రామంలో శనివారం రాత్రి రైతులు, సహకార సంఘాల అధికారులతో నియోజకవర్గ సమన్వయకర బన్నూరు రామలింగారెడ్డి అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో గోదాములు అస్తవ్యస్తంగా నిర్మించారని, అవి ఇప్పటికిప్పుడు వినియోగంలోకి రావాలంటే చాలా కష్టమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని అందుకు రైతులే సూచనలు సలహాలు ఇవ్వాలని సూచించారు. డీసీవో వెంకటసుబ్బయ్య, నాయకులు సురేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, భరద్వాజశర్మ, మనోహర్‌చౌదరి, మల్లీశ్వరరెడ్డి, చిన్నలింగారెడ్డి, సుబ్బారెడ్డి, బుగ్గరాముడు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

19న కాంట్రాక్టు ఉద్యోగుల మహాసభ

• కరపత్రాలు విడుదల చేసిన రాష్ట్ర నాయకులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ 6వ రాష్ట్ర సభను ఈ నెల 19న విజయవాడలో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మునెప్ప, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.మనోహర్ మానిక్యం తెలిపారు. శనివారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని యూనియన్ ఆఫీసులో వారు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బోధనాసుపత్రులు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో పని చేసే శానిటేషన్ సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో జరిగే యూనియన్ రాష్ట్ర మహాసభలో భవిష్యత్ నిర్ణయాలను ప్రకటిస్తామన్నారు. మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సెక్యూరిటీ గార్డ్, శానిటేషన్, యూనియన్ నాయకులు రాజు,సురేష్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.


దాతకు చిత్రపటాన్ని అందజేస్తూ..

అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్‌కు చెందిన కొవ్వూరి శ్రీనివాసులు అనే భక్తుడు రూ. 1,01,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

• న్యాయాధికారి పాండురంగారెడ్డి



మాట్లాడుతున్న 6వ అదనపు న్యాయాధికారి పి. పాండురంగారెడ్డి

కర్నూలు లీగల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు, న్యాయవాదులు, మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తే సత్వర న్యాయం పొందవచ్చని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి పి. పాండురంగారెడ్డి తెలియజేశారు. స్థానిక న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ భవనంలో మధ్యవర్తిత్వంపై ఒక ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో అనేక లాభాలు ఉన్నాయని, కక్షిదారులు, న్యాయవాదులు ఈ మధ్యవర్తిత్వాన్ని అంగీకరిస్తే.. పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మధ్యవర్తిత్వం, విధి విధానాల గురించి న్యాయవాదులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఉభయ పార్టీలకు ఆమోదయోగ్యమైన ఒక విధానమని, కక్షిదారులు మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తే ఖర్చు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుల అరెస్టు



మద్యం బాక్సులను చూపుతున్న డోన్ రూరల్ పోలీసులు

డోన్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): వ ండ ల ం లో ని తాటిమాను కొత్తూరు గ్రామ సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను డోన్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. డోన్ రూరల్ సీఐ రాకేష్ తన పోలీసు సిబ్బందితో తనిఖీ చేస్తుండగా.. కారులో తరలిస్తున్న అక్రమ 20 బాక్సుల టెట్రా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్ణాటకకు చెందిన 1920 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈడిగ సోమశేఖర్, అదే మండలానికి చెందిన గుడిసె గుప్పరాళ్ల గ్రామానికి చెందిన ఈడిగ సురేంద్ర కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి మద్యం తీసుకుని వచ్చి గ్రామాల్లో అధిక రేట్లకు విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఆ మేరకు నిందితులను అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని పని..!

• వైఎస్ఆర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వ్యక్తి


క్షీరాభిషేకం చేస్తున్న వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఓ మతిస్థిమితం లేని వ్యక్తి చెప్పుల దండను వేశాడు. శనివారం ఉదయం ఉన్నట్టుండి ఓ మతి స్థిమితం లేని వ్యక్తి రెండు చెప్పులను తీసుకొని పైకి ఎక్కి తాడుతో వాటిని కట్టి వైఎస్ విగ్రహం మెడలో వేసి తాపీగా కిందికి దిగిపోయాడు.

స్థానికులు వైసీపీనాయకులకు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడే ఉన్న ఓ వైసీపీ కార్యకర్త వైఎస్ఆర్ మెడలో ఉన్న చెప్పులను తొలగించాడు. వైసీపీ సీనియర్ నాయకుడు వై.రుద్రగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, నాయకులు సునీల్, కోటేకల్ లక్ష్మన్న అక్కడికి చేరుకొని వైఎస్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలదండలు వేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతిపత్రం అందించారు.

బాలిక అదృశ్యం

మిడుతూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. వివరాలివీ.. బాలిక ఈ నెల 5వతేది ఉదయం 5గంటల నుంచి ఇంటిలో కనబడం లేదని, బంధువుల దగ్గర వెతికినా కనిపించడం లేదని శనివారం బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

బనగానపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ చైతన్య ప్రైవేటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ధృవకుమార్ అధిక మార్కులు వేయిస్తామని విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పాఠశాల యాజమాన్యం శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. గణితం ఉపాధ్యాయుడు ధృవకుమార్ యాజమాన్యానికి తెలియకుండా పరీక్షల్లో అధికంగా మార్కులు వేయిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఈమేరకు ధృవకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిసి వారి తల్లిదండ్రులు దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు సమాచారం.

సైబర్ నేరగాళ్ల వలలో నిరుద్యోగి

• మూడు గంటలు పనిచేస్తే రూ.30 వేలు ఇస్తామని మోసం
• నిరుద్యోగి నుంచి రూ.4.60 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
• పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితుడు


బాధితుడు హరీష్ గౌడ్

హొళగుంద, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు పార్ట్ టైమ్ జాబ్స్ ఆశ చూపించి సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. ఇలాంటి ఘటన కర్నూలు జిల్లా హొళగుంద మండలం నేరణికి గ్రామంలో వెలుగు చూసింది. డిగ్రీ వరకు చదువుకున్న హరీష్ గౌడ్ అనే నిరుద్యోగి వాట్సప్‌కు ఈనెల 2న ఒక మెసేజ్ వచ్చింది. అందులో పార్ట్‌టైం జాబ్ మూడు గంటలు చేస్తే రూ.30,000 వేలకుపైగా జీతం ఇస్తామని ఉంది. హరీష్ దానికి రిప్లై ఇచ్చాడు. ఈ ఉచ్చు పన్నిన సైబర్ నేరగాళ్ళు హరీష్‌ను టార్గెట్ చేశారు. అతనికి ఓ లింక్ పంపించారు. ఓ మహిళా కాల్ చేసి పార్ట్ టైం జాబ్ ఉందని, దాని కోసం ముందస్తుగా కొంత నగదు పంపిస్తే ఉద్యోగం రిజర్వ్ చేస్తామని చెప్పారు. ఈ మాటలు నమ్మి హరీష్ వారు చెప్పిన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతా నెంబర్ ఏ/సీ 99522100008273కు రూ. 1,74,264 జమ చేశాడు. ఆ తర్వాత మరోసారి ఇంకింత డబ్బు పంపమని చెప్పడంతో అదే ఖాతాకు రూ.69,065 జమ చేశాడు. ఇట్లా రూ.4,60,000 చెల్లించాక కూడా ఇంకా డబ్బు పంపమని చెప్పడంతో హరీష్‌కు అనుమానం వచ్చింది. సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌లను ఆన్‌లైన్ లో పరిశీలించగా అది ఫేక్ అని తెలిసింది. తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. ఉద్యోగం వస్తుందన్న ఆశతో చేసిన లక్షల రూపాయల అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదని కన్నీటి పర్యంతం అయ్యాడు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

'హరిజోన్స్'కు రతన్ టాటా అవార్డు


సీడ్ సంస్థ నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న హరిజోన్స్ ప్లే స్కూల్ చైర్మన్ ప్రదీప్ కుమార్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సోమిశెట్టి నగర్‌లోని హరిజోన్స్ ఇంటర్నేషనల్ ప్లేస్కూల్‌కు రతన్ టాటా అవార్డు దక్కింది. హైదరాబాదు హైటెక్ సిటీలోని నేషనల్ ఎడ్యుకేషన్ సమిట్‌ను బ్రెయిన్ ఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ట్రెయిల్ బ్లేజర్ రతన్ టాటా అవార్డు, ప్రశంసాపత్రాన్ని, మెమెంటోను హరిజోన్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ చైర్మన్ ప్రదీప్ కుమార్, డైరెక్టరు పావనీలకు సంస్థ నిర్వాహకులు అందజేశారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుద్దాం

కలెక్టర్ పి.రంజిత్ బాషా


విరాళం అందజేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యుద్ధంలో మరణించిన అమరవీరులు, మాజీ సైనికుల కుటుంబాలకు అండగా నిలుద్దామని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. శనివారం సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఫ్లాగ్ డే ఫండ్ కోసం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరవీరుల గౌరవార్థం ప్రతి ఏటా డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తారన్నారు. కన్నవారికి, ఉన్నవారికి దూరంగా ఉంటూ మాతృభూమి రక్షణకు నిరంతరం సేవలందించేది సైనికులే అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ఆర్ రత్న రూత్, సిబ్బంది పాల్గొన్నారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో 8, 9 తేదీల్లో జరిగే సీపీఎం నగర మహాసభలను జయప్రదం చేయాలని నగర కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మహాసభల కోసం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కూడలి నుంచి పాతబస్టాండు వరకు ఎర్రతోరణాలతో అలంకరించామని, జమ్మిచెట్టు వద్ద 8 సాయంత్రం జరిగే బహిరంగ సభలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


శివారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఏపీ ఎన్జీవోస్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. శనివారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి జిల్లా ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 31న ఖాళీ అవుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థానానికి కృష్ణా జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌ను ప్రతిపాదించిన తీర్మాణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాశన్న, రామకృష్ణ, శ్రీనివాసులు, శేఖర్ రెడ్డి, హుశేన్‌రెడ్డి, రాముడు, సత్యనారాయణ, శ్రీనివాస్ యాదవ్, లీలావతి, రంగస్వామి, వీరాంజనేయులు, రవిప్రకాష్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణుడు, రామకృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు, ముడుమాల, శింగవరం, ఈర్లదిన్నె గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ గోనెనాయక్ శనివారం పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి విద్యుత్‌మోటార్లకు మరమ్మతులు చేయాలన్నారు.

చదువుతోనే భవిష్యత్తు

- మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో అతిథులు
- హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు


ఓర్వకల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి


కస్తూరీనగర్‌లో విద్యార్థులతో ఎమ్మెల్యే గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతోపాటు టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎంఈవో ఓంకార్ యాదవ్ అధ్యక్షత వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దేశంలోనే తొలిసారిగా విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో స్థిరపడడానికి విద్య ఎంతో అవసరమన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలకు క్రీడా పరికరాల కోసం గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి రూ.10వేల నగదును అందజేశారు. ఎమ్మెల్యేని, ప్రజాప్రతినిధులను, నాయకులను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్ఐ సునీల్ కుమార్, జడ్పీటీసీ రంగనాథ గౌడు, ఎంపీపీ తిప్పన్న, టీడీపీ మండల అధ్యక్షుడు గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు రాంభూపాల్ రెడ్డి, యేసేపు, లక్ష్మణ్ నాయక్, మహబూబ్ బాషా, యేసేపు, విద్యాకమిటీ చైర్మన్లు అయూబ్ బాషా, సంజీవరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

విద్యాశాఖలో సమూల మార్పుకు శ్రీకారం: మల్లెల

విద్యాశాఖలో సమూల మార్పుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని హుస్సేనాపురం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి మల్లెల రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మల్లెల రాజశేఖర్‌తోపాటు, సర్పంచు గోవర్ధనమ్మను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిప్రియ, విద్యా కమిటీ చైర్మన్ మధు, గ్రామ పెద్దలు మహబూబ్ బాషా, కేవీ మధు, వడ్డె నారాయణ, కాటినేని నారాయణ, జయకృష్ణ, బజారు, గువ్వ రవికుమార్, బలిజ జగదీష్ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. శనివారం పెద్దపాడు దామోదరం సంజీవయ్య స్మారక ప్రభుత్వ బాలికల పాఠశాల, ఎస్ఏపీ క్యాంపులోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలకు కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికే ఎంపీటీ సమావేశాలు: విద్యావ్యవస్థ బలోపేతానికి మెగా పేరెంట్స్-టీచర్స్ (ఎంపీటీ) సమావేశాలు దోహదపడతాయని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. శనివారం కంట్రోల్ రూము వద్ద ఉన్న టౌన్‌మోడల్ పాఠశాలలో నిర్వహించిన ఎంపీటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం కర్నూలు మండలం, మిలటరీ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే దస్తగిరి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు.

● తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థుల భవితను తీర్చిదిద్దాలని విజ్ఞాన పీఠం ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వ్యాసరాజ్ అన్నారు. శనివారం పాఠశాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహానికి బాలల తల్లిదండ్రులు, మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పోటీలు నిర్వహించి సమష్టిగా మధ్యాహ్న భోజనం చేశారు. ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కే మద్దిలేటి, వైస్ చైర్మన్ అనసూయమ్మ, హెచ్ఎం వ్యాసరాజ్, ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వి.సుదర్శనరావు, నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు రామిరెడ్డి, స్వర్ణలత, సోమయ్య, రణధీర్‌రెడ్డి, వంశీ, రాఘవ, రేణుక పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు అన్నారు. కల్లూరు మండలం అశ్వర్థాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్, స్కూల్ హెచ్ఎం కీర్తి, గ్రామ పెద్దలు ఈదుర్‌బాషా, అన్వర్‌బాషా, మౌలాలి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్లూరు: విద్యార్థుల ప్రగతికి టీడీపీ కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ అన్నారు. శనివారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను చక్కదిద్ది పేద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అదేవిధంగా పలువురు జిల్లా అధికారులు కల్లూరు రూరల్, అర్బన్ పరిధిలోని పాఠశాలల్లో హాజరయ్యారు. డీఎంహెచ్ఓ భాస్కర్ రాజీవ్ స్వగృహ పాఠశాల, పెద్దపాడు ప్రభుత్వ బాలికల పాఠశాలలో కమిషనర్ రవీంద్రబాబు, అలాగే పెద్ద పాడు మోడల్‌స్కూల్‌లో డీఎస్పీ బాబుప్రసాద్, లక్ష్మీపురం జడ్పీ, కేజీబీవీలో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ టీడీపీ నాయకుడు పుల్లారెడ్డి, తడకనపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీఓ జీవీ శేషాచలరెడ్డి, పెద్దకొట్టాలలో ఏపీ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనుయులు, ఉలిందకొండ ప్రభుత్వ పాఠశాలలో టీడీపీ నాయకుడు ఈవీ రమణ పాల్గొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు బోధన, మధ్యాహ్న భోజనాన్ని ఆర్డీఓ పరిశీలించారు. హెచ్ఎంల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రులు, ఎస్ఎంసీ చైర్మన్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● విద్యార్థుల ప్రగతికి టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం కస్తూరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు.

● కల్లూరు జడ్పీ పాఠశాలలో హెచ్ఎం హుసేన్ ఆధ్వర్యంలో టీచర్స్ పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చదువులో రాణించాలన్నారు.

కోడుమూరు రూరల్: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం చేపట్టిన మెగా పేరెంట్స్- టీచర్స్ ఆత్మీయ సమావేశం పండుగలా జరిగింది. పులకుర్తిలో ఎంఈవో వసంతలక్ష్మి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి సామూహిక భోజనం చేశారు.

గూడూరు: మండలంలోని 33 పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం జరిగింది. శనివారం మండలంలోని జులకల్ గ్రామంలో బెస్ట్ పాఠశాలగా ఎన్నికైన ఏపీ మోడల్ స్కూల్‌లో ఎంపీడీవో శివనాగప్రసాద్, ఎంఈవో-2 నాగరాజు పాల్గొన్నారు. విద్యార్థులకు హోలిస్టిక్ కార్డ్స్, హెల్త్ కార్డులను అందజేసి వారి ప్రగతి గురించి తల్లిదండ్రులతో చర్చించారు. అలాగే పెంచికలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌లో ఎంఈవో సునీలమ్మ హాజరై మాట్లాడారు. అలాగే గూడూరు పట్టణంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షులు గజేంద్రగోపాల్ నాయుడు, కౌన్సిలర్ బుడ్డంగలి పాల్గొన్నారు. అలాగే గూడూరు పట్టణంలోని జేబీ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగులో కర్నూలు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ పాల్గొన్నారు.

సి.బెళగల్: విద్యార్థులు క్రీడలతోపాటు చదువులో రాణించాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందుగౌడు అన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సి.బెళగల్‌లోని జడ్పీ, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో గోవిందుగౌడు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంపీపీ బొంతల మునెప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న కమిషనర్, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్


అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనం చేస్తున్న తల్లిదండ్రులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ, ప్రజారోగ్యం విభాగంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.పులగం మద్దిలేటి కోరారు. శనివారం నగర పాలక కమిషనర్ రవీంద్రబాబుతో ఏఐటీయూసీ నాయకులు పారిశుధ్య కార్మికుల సంఘం చర్చలు జరిపింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య పనిముట్లు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మెకాలపు వేతనాలు, పండుగ సెలవులు, టైం స్కేల్ కార్మికుల బకాయి వేతనాలు చనిపోయిన 8వ డివిజన్ కేర్ టేకర్ ఎం.శ్యామలమ్మ మట్టిఖర్చులు ఎక్స్‌గ్రేషియా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం తదితర వాటిపై చర్చలు జరిపామన్నారు. నాయకులు సవారి, నాగేంద్ర, మాణిక్యం, సాయినాథ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకొని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శనివారం భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు నిర్వహించారు. నగర శివారు విజ్ఞానపీఠంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో విజ్ఞాన పీఠం అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణయ్య, వీహెచ్‌పీ నాయకులు మాణిక్యరెడ్డి, మద్దిలేటి, నాగరాజు, రాధిక, చంద్రమోహన్, మాధవస్వామి, రామిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి చర్యలు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉద్యానవన స్థలాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం 19వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో కమిషనర్ పర్యటించారు. ధనలక్ష్మీనగర్, రాంప్రియనగర్, ప్రశాంతినగర్ కాలనీల్లోని పార్కుల్లో అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం ఆనంద్ థియేటర్ సమీపంలో మురుగు కాలువలను పరిశీలించారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డీఈఈలు, ఏఈ పాల్గొన్నారు.

నేడు భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. మొత్తం నాలుగు విభాగాల్లో పోటీలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారని, వివరాలకు 90598 02265 సెల్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

గతం వదిలేసి ముందుకు సాగాలి

- ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ
- కప్పట్రాళ్లలో ఎస్పీ బిందు మాధవ్, విద్యార్థులతో ఆత్మీయ సమావేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐజీ రవికృష్ణ, ఎస్పీ బిందుమాధవ్



పూడికతీత పనులను ప్రారంభిస్తూ..

దేవనకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గతం వదిలేసి ముందుకెళ్లాలని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. ఐదేళ్ల తరువాత కప్పట్రాళ్లకు వచ్చిన రవికృష్ణకు గ్రామస్తులు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. తానా భవనం నుంచి జడ్పీ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయయలు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఎస్పీ బిందుమాదవ్, ఈగల్ ఎస్పీ నాగేశ్వరరావు ,వాల్మీఇ కార్పోరేషన్ ఛైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్యతో కలిసి పాల్గొన్నారు. ఆరే రవికృష్ణ మాట్లాడుతూ 2015లో సీఎం చంద్రబాబు గ్రామాలను దత్తత తీసుకోవాలని ఆదేశించారన్నారు. తాను కప్పట్రాళ్లను దత్తత తీసుకున్నట్లు గుర్తు చేశారు. నాడు గ్రామంలో సరైన మౌలిక వసతులు లేవని ప్రభుత్వం, పలు సంస్థలను భాగస్వామ్యం చేయడంతో అభివృద్ధి చేశారన్నారు. కప్పట్రాళ్ల విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ అయినప్పుడు గర్వంగా ఉంటుందన్నారు. కప్పట్రాళ్ల వైపు దేశం చూస్తోందని ఎస్పీ బిందుమాదవ్ అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. బాలికలు సైబర్ నేరాల్లో చిక్కుకోవద్దన్నారు. డ్రగ్స్ రహిత సమాజం స్థాపించాలని డ్రగ్స్‌వద్దు బ్రో అన్న పోస్టర్లను ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణంలో న్యూట్రిషన్ గార్డెన్‌ను ఎస్పీ ప్రారంబించారు. అనంతరం నూతన దంపతులకు నూతన వస్త్రాలు బహూకరించారు .గ్రామ సమీపంలో వున్న ముద్దరేణికుంటలో పూడిక తీత పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామస్తులను ఆత్మీయంగా పలికరిస్తూ ముదుకు సాగారు. సంక్రాంతి వేడుకలకు రావాలని గ్రామానికి చెందిన మహిళలు అడగటంతో వస్తానన్నారు. తానా సంస్థ పోట్లూరి రవి, ఎంపీటీసీ రూపమ్మ, దేవి యాక్ట్ విజయభాస్కర్, స్రేటీస్ ప్రోగ్రాం మేనేజర్ నారాయణ, మల్లికార్జున, దివాకర్ నాయుడు, చింతా మధుసూదన్, చింపిఈరన్న, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

మురుగు నియంత్రణకు చర్యలు



మురుగును పరిశీలిస్తున్న ఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మురుగు వల్ల దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటామని ఆలూరు పంచాయతీ ఈవో ప్రభాకర్ రావ్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 6నా ప్రచురితమైన సాంఫీక మురుగు కార్యాలయం అనే వార్తకు ఆయన స్పందించారు. మురుగు నిల్వ ఉన్న కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండాలంటే అండర్ గ్రౌండ్ డ్రెయిన్ అవసరమని అందుకోసం అధికారుల ప్రతిపాదనలు కూడా పంపించామన్నారు. గతంలో డ్రెయినులు నిర్వహించిన మురుగు నీరు ముందుకు సాగడం లేదన్నారు. ఇందుకోసం మురుగు నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు.

ఇంకా జగనన్న ఆణిముత్యాలేనా?



పాఠశాల గేటుకు కట్టిన బ్యానర్

వెల్దుర్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల(బాలికలు)లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం మారినప్పటికీ 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో పదో తరగతిలో టాపర్లుగా ముగ్గురు విద్యార్థినుల ఫొటోతో కూడిన ఫ్లెక్సీని గురుకుల పాఠశాల అధికారులు ఏర్పాటు చేశారు. ఉత్తమ విద్యార్థినుల ఫొటోలు ఏర్పాటు చేయడం మంచిదే. కానీ ప్రభుత్వం మారినప్పటికీ ఇంకా 'జగనన్న'నామస్మరణ చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ షబానాను వివరణ కోరగా గత ఏడాది నుంచి బ్యానర్ అలాగే ఉందని తెలిపారు.

వధూవరులకు పట్టు వస్త్రాలు పంపిన సీఎం చంద్రబాబు



పట్టువస్త్రాలు ఇస్తున్న తిక్కారెడ్డి, బీటీ నాయుడు

ఆదోని, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడి తమ్ముడు దిలీప్ కుమార్ కుమార్తె ఉమామహేశ్వరి, అనిరుద్ చౌదరి వివాహం ఆ శనివారం పట్టణంలోని వాసవి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. సమయాభావం వల్ల తాను హాజరు కాలేకపోతున్నానని, సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు, అక్షింతలను టీడీపీ జిల్లా తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీనాయుడు చేతుల మీదుగా అందించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొన్నారు. నాయకుడు మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు వేసిన చిందులు ఆకట్టుకున్నాయి.

సదస్సులను ఉపయోగించుకోండి

ఆదోని రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ అన్నారు. సోమవారం మండిగిరి సచివాలయం-1లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, పర్వతాపురంలో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు.

ఎమ్మెల్యేకు కార్మికుల వినతి

ఆదోని టౌన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనిరింగ్ అవుట్ సోర్స్ కార్మికులు శనివారం ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు సోమన్న, వెంకటేశ్వర్లు, పీరా మాట్లాడుతూ, పది సంవత్సరాలకు పైబడి పని చేసిన కార్మికులను రెగ్యులర్ చేయాలని, జీవో 63 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని, అనారోగ్యం కారణంగా విధులు నిర్వర్తించలేని కుటుంబంలో ఒకరికి అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అహ్మద్ హుసేన్, కృష్ణమూర్తి, కర్రెప్ప పాల్గొన్నారు.

రజకులకు రుణాలివ్వాలి

మద్దికెర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రజకులకు వంద శాతం రాయితీతో రుణాలు ఇవ్వాలని ఆ సంఘం అధ్యక్షుడు చిరంజీవి, సభ్యులు వెంకప్ప, రంగన్న డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ గ్రామాలో దోబీ ఘాట్లను నిర్మించి, పరికరాలు ఇవ్వాలని కోరారు.

నర్సింగ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేషనల్ నర్సింగ్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మిగనూరు సర్కిల్లో నిరసన తెలిపారు. కనీసం బిల్డింగ్‌లో కూడా లేదని రేకుల షెడ్డులో నడిపిస్తున్నారన్నారు. అధికారులు తనిఖీలు చేసి, విద్యార్థులకు ఫీజులను వెనక్కి ఇప్పించాలని కోరారు. లింగప్ప, దస్తగిరి, శేఖర్, వీరేష్, మోహన్, సందీప్, సునీల్, హుస్సేన్ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

మద్దికెర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుణాలను సకాలంలో చెల్లించాలని కెనరా బ్యాంకు మేనేజర్ వెంకటేశ్‌గౌడ్ కోరారు. శనివారం మాట్లాడుతూ కెనరా బ్యాంకు ద్వారా వ్యాపారం, బంగారు, వ్యవసాయ, వ్యక్తిగత రుణాలు ఇచ్చామన్నారు.

మత్స్యకార సంఘం అధ్యక్షుడిగా పుల్లన్న

తుగ్గలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార సంఘం అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ పుల్లన్నను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. శనివారం తుగ్గలిలో మత్స్యశాఖ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర సహకారంతో మట్టి పుల్లన్నను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

పండుగలా సమావేశాలు

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం పండుగలా సాగింది. శనివారం ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజవర్గాల్లో వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థుల చదువుకు సంబంధించి సూచనలు ఇచ్చారు.



ఆదోని మున్సిపల్ హైస్కూల్లో ముగ్గు వేసున్న ఎమ్మెల్యే పార్థసారథి



తుగ్గలి నాగేంద్రకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే బంగారు భవిష్యత్తు అని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మల్లికార్జున అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నతనం నుంచే పెద్దల పట్ల సంస్కారం గౌరవం నేర్పిస్తే పెద్దయ్యాక ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. పాఠశాలల అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, న్యాయ వాది సావిత్రి చట్టాలపై విద్యార్థులకు తల్లితండ్రులకు వివరించారు. ఎంఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ధీటుగా ప్రభుత్వ బడులు

కార్పొరేట్ ధీటుగా ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసిందని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డిప్యూటీ ఈవో వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో, అలాగే ఆరెకల్లు గురుకుల పాఠశాలలో పాల్గొఆన్నరు. పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణతకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అలీం సిద్ధికీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ హాజరయ్యారు. ఆర్‌ఆర్‌లేబర్ కాలనీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఉపాధ్యాయుల సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కిల్చిన్ పేట పాఠశాలలో హెచ్‌ఎం సునీల్ రాజ్ కుమార్, ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పాఠశాలలో రమేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే దొడ్డనకేరి జడ్పీ పరిషత్ పాఠశాలలో ఎంఈవో రాజేంద్రప్రసాద్, ధనాపురం జడ్పీ పాఠశాలకు ఎమ్మెల్సీ మధుసూదన్ హాజరుకాగా కడి తోట ఎంపీయూపీ పాఠశాలలో హెచ్‌ఎం సుదర్శన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటలు పోటీ నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు.

పత్తికొండ టౌన్: విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తీర్ణత సాదించవచ్చని పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పాల్గొన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో మెలగాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. తల్లులకు నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆర్డీవో తిలకించారు. సర్పంచ్ కొమ్ముదీపిక, ఎంఈవో రమేష్, పాఠశాల హెచ్‌ఎం మాలతితో పాటు పాఠశాలల యాజమాన్య కమిటి ఛైర్మన్ ఫీరా మోహిద్దీన్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలూరు: విద్యాభివృద్ధే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. బాలుర ఉన్నత పాఠశాల-1లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో రూపొందించేందుకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ఎస్ఎంసీ ఛైర్మెన్ భారతి, సర్పంచ్ అరుణదేవి, తహశీల్దార్ గోవింద్ సింగ్, ఎంఈవోలు కొమలదేవి, చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు. మోడల్ స్కూల్‌లో ఎస్ఎంసీ ఛైర్మెన్ విరుపాక్షయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాఘవరావు వైస్ ప్రిన్సిపాల్ వీరేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కడితోట పాఠశాలలో టగ్ ఆఫ్ వార్..

హోళగుంద: గురువులను తల్లితండ్రులను గౌరవించాలని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్, ఎమ్మెల్యే వీరుపాక్షి సూచించారు. శనివారం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తల్లితండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టేబుళ్ల కొరత ఉందని ఉపాధ్యాయులు తెలపడంతో స్పందించిన వీరభద్ర గౌడ్ రూ.60వేలతో టేబుళ్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. విద్యాకమిటీ ఛైర్మన్ ద్వారకా నాథ్, హెడ్ మాస్టర్ నజీర్ అహమ్మద్, రాజా పొంపన్న గౌడ్, బీజేపీ నాయకులు చిదానందా, ఈడిగ ప్రసాద్, జనసేన నాయకులు చిన్న, అశోక్ పాల్గొన్నారు.

తుగ్గలి: విద్యార్థులు కమశిక్షణ అలవాటు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర సూచించారు. శనివారం తుగ్గలి, జొన్నగిరి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీట్‌ను నిర్వహించారు. తుగ్గలిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ వరలక్ష్మి, తహసీల్దార్ రమాదేవి, ఎంఈవో రామ వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు. హెచ్‌ఎంలు బాబురావు, ఉపేంద్ర, తిరుపాల్ నాయుడు, విద్యాకమిటి ఛైర్మన్లు రవియాదవ్, సర్పంచ్ ఓబులేసు, టీడీపీ నాయకులు బాలన్న, లక్ష్మణస్వామి, ఉపాధ్యాయులు చందు నాయక్, భాస్కర్, తల్లిదండ్రులు ఉన్నారు.

ఆస్పరి: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్, సర్పంచ్ మూలింటి రాధమ్మ, ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ తాయమ్మ అన్నారు. శనివారం పాఠశాలల్లో పేరెంట్స్ అండ్ టీచర్స్ మీట్ నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, ఎంపీడీవో గీతావాణి, ఎంఈవో తిరుమల రావు, హెచ్‌ఎం విజయ్ కుమారి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మద్దికెర: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలని తహసీల్దార్ హుశేన్‌సాహేబ్, ఎంఈవో రంగస్వామి, ఎస్ఐ విజయకుమార్ నాయక్ అన్నారు. శనివారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో జడ్పీహెచ్ఎస్, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో తల్లిదం డ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ మురళిధర్ రెడ్డి, ఎంపీపీ అనితా యాదవ్, సర్పంచులు సుహాసిని, విజయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, టీడీపీ నాయకులు ఎర్రిస్వామి, ఆనంద్‌కుమార్, హెచ్‌ఎంలు జ్యోతిరెడ్డి, అజరయబాబు, సవిత, ఎన్ఎండీ ఫరూక్, విద్యాకమిటి ఛైర్మన్లు ఉన్నారు.

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లె జడ్పీహెచ్ పాఠశాలలో టీడీపీ జిల్లా నాయకుడు సుబ్బరాయుడు, వెల్దుర్తి జడ్పీహెచ్ఎస్ (బాలుర) పాఠశాలలో టీడీపీ మండలాధ్యక్షుడు బలరాంగౌడు, యువనాయకుడు రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, జడ్పీహెచ్ఎస్ (బాలికల) పాఠశాలలో జ్ఞానేశ్వర్‌గౌడ్, ఎంఈవో ఇందిర, సూదేపల్లె జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జయరాముడు, కలగొట్లలో రామకృష్ణ, రామళ్లకోటలో రామకృష్ణాచారి, కేజీబీవీ పాఠశాలలో సుధాకర్‌గౌడ్, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు

వెల్దుర్తి టౌన్: విద్యార్థులు చదువుతోనే సమాజంలో గౌరవ మర్యాదలు పొందుతారనీ మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు అన్నారు బాలికల పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావే శానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వార్డెన్ శైలజ, ఎంఈవో ఇందిర, జడ్పీటీసీ సుంకన్న, మాజీ జడ్పీటీసీ ఐజయ్య, పూర్వ విద్యార్థుల సంఘం సెక్రటరీ రవిశంకర్, అగస్టీన్, విద్యాకమిటీ ఛైర్మన్ రాజేష్, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



ఆలూరు బాలుర పాఠశాలలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



పత్తికొండలో ముగ్గులను పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

మధ్యవర్తిత్వానికే మీడియేషన్ కేంద్రాలు



మాట్లాడుతున్న న్యాయాధికారి జ్యోతి

పత్తికొండ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ టౌన్: మధ్యవర్తిత్వానికే కోర్టులు మీడియేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశాయని జేన్ అడిషినల్ సివిల్ న్యాయాధికారి ఎస్.జ్యోతి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు శనివారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో మధ్యవర్తిత్వంపై అవగాహన నిర్వహించారు. భరణం కేసులు, ప్రామిసరీ నోట్లు, ఆస్తితగాదాల కేసుల్లో ఇరువర్గాలతో మాట్లాడి ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరిస్తారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ న్యాయవాదులు కారప్ప, హుల్తన్న, సత్యనారాయణ, నాగభూషణంరెడ్డి, నాగేష్, నారాయణస్వామి, నరసింహయ్య, కృష్ణ పాల్గొన్నారు.

నవ దంపతుల హోమాలు



హోమాలు చేస్తున్న నవ దంపతులు

మద్దికెర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దమ్మకుంటలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర షష్టి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారంవంద మంది నవదంపతులతో హోమాలు నిర్వహించారు. ఉదయం తెల్లవారుజామున అభిషేకాలు, చేశారు.

కూలీల సంఖ్య పెంచాలి

తుగ్గలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీడీ ఫక్కీరప్ప సూచించారు. శనివారం కోతికొండ గ్రామంలో పనులను తనిఖీ చేశారు. పనులకు రాకున్న వారి పేర్లు చేరిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించ్చారు. టీఏ రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంటు రవికుమార్, సీనియర్ మేట్లు నారాయణ, మల్లన్న పాల్గొన్నారు.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే

ఆదోని టౌన్, డిసెంబరు7, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను బడికి పంపడంతో తల్లి తండ్రుల బాధ్యత అయిపోదని, వారి బాగోగులు చూడాలని కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అన్నారు. శనివారం అమరావతి నగర్‌లోని మునిసిపల్ పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో పాల్గొన్నారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి అధ్యక్షతలో జరిగిన సమావేశంలో స్కూల్ కమిటీ ఛైర్ పర్సన్ గీత, వైస్ ఛైర్మన్ మధు, సిబ్బంది శివజ్యోతి, విజయ భాస్కర్, ఫరిదున్నిసా, రమేష్ నాయక్, బీజేపీనాయకుడు వెల్లాల మధుసూదన్ వర్మ, టీడీపీ నాయకులు మహమ్మద్, మధు, నూర్జహాన్ పాల్గొన్నారు.

హాస్టళ్ల అభివృద్ధికి కృషి

తుగ్గలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి కృషి చేస్తామని జియో మైసూరు కంపెనీ డైరెక్టర్ మానసరంజ్ బిశ్వాల్ అన్నారు. శనివారం జొన్నగిరిహాస్టల్‌ను సర్పంచ్ ఓబులేసు, విద్యాకమిటీ ఛైర్మన్ రవితో కలిసి పరిశీలించారు. మౌలిక వసతులను కల్పిస్తామని, ఇప్పటికే మురుగు కాలువ కూడా ఏర్పాటు చేశామన్నారు. వార్డెన్ రమేష్, టీడీపీ నాయకులు బాలన్న, లక్ష్మణస్వామి, తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులే ఆధారం..

ఆదోని రూరల్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పిల్లల చదువుకు తల్లిదండ్రులే ఆధారమని తహసీల్దార్ శివరాముడు అన్నారు. శనివారం బల్లేకల్లు పాఠశాలలో పాల్గొన్నారు. సర్పంచ్ లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పత్తికొండ వెలుగు ఏపీఎం చక్రధర్



పత్తికొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళ ఆర్థిక సాధికారతే లక్ష్యంగా పనిచేస్తూ, పొదుపు మహిళలను ప్రోత్సహిస్తున్నామని పత్తికొండ వెలుగు ఏపీఎం చక్రధర్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: పత్తికొండ మండలంలో ఎన్ని పొదుపు సంఘాలు ఉన్నాయి?

జవాబు: 1,364 పొదుపు సంఘాలుండగా, సుమారు 14 వేల మంది సభ్యులు, 48 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి.

ప్రశ్న: ఎలాంటి రుణాలు ఇస్తున్నారు ?

జవాబు: బ్యాంకు రుణాలతోపాటు పత్తికొండ మహిళా సమాఖ్య ద్వారా శ్రీనిధి రుణాలు ఇస్తున్నాం. 5గురు సభ్యులను గ్రూపుగా చేసి, ఒక్కొక్కరికి రూ50వేల చొప్పున గ్రూపుకు రూ 2.5లక్షల రుణం ఇస్తున్నాం. 22 కంతుల్లో రుణాల చెల్లింపుకు అవకాశం కల్పిస్తున్నాం.

ప్రశ్న: రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లిస్తున్నారా?

జవాబు: పత్తికొండ మండలంలో 100 శాతం మంది తిరిగి చెల్లిస్తున్నారు.

ప్రశ్న: స్వయం ఉపాధి కల్పిస్తున్నారా?

జవాబు: ఉత్పత్తి ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అందుబాటులో ఉంచింది. ఓఎన్‌డీసీ ద్వారా డిజిటల్ కామర్స్ సంస్థ మహిళలు తయారుచేసిన వస్తువులను ఆన్‌లైన్‌లో విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఉమెన్‌లెట్ ద్వారా పెరటి కోళ్ల, , బర్రెల పెంపకం. చిరు వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశాలను కల్పిస్తున్నాం.

పెట్టుబడి సాయం అందించడంలో విఫలం

రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి రామచంద్రయ్య


మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఎమ్మిగనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ సుఖీభవ పథకం అమలులో ప్రభుత్వం విఫలమయిందని ఏపీ రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి రామచంద్రయ్య విమర్శించారు. శనివారం పట్టణంలోని మక్బుల్ ఫంక్షన్ హాల్‌లో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంపన్న గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన రామచంద్రయ్య మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు ఇస్తామని వాగ్దానం చేసిందని, ఇప్పుడు సాయం అందించటంలో విఫలమైందని విమర్శించారు. ఈ ఏడాది మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మిరపకు తెగుళ్ల సోకడంతో దిగుబడి తగ్గిందని, దీనికి తోడు మార్కెట్‌లో ధర లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తెలంగాణ మాదిరిగా రుణాలు మాఫీ చేయాలని, పంటలబీమాను రైతుల ఖాతాల్లో జమచేయాని కోరారు. ఈ సమావేశంలో రైతుసంఘం జిల్లాకార్యదర్శి జగన్నాథం, నాయకులు రంగన్న, భాస్కర్ యాదవ్, చిన్నన్న, కేసీ జబ్బార్, మాలిక్, శాంతప్ప, గిడ్డయ్య, ఖాజా, బడేసాబ్, ఉమాపతి, గోపాల్, ఎల్లప్పలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుటుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పుట్టపాశం గ్రామంలో పర్యటించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూడలిలో ఆయన ప్రసంగించారు. గ్రామంలో తాగునీటి సమస్య రాకుండ ఉండేందకు గాను గ్రామానికి జలజీవన్‌మిషన్ కింద రూ. 70 లక్షలతో ఓహెచ్‌ఆర్ ట్యాంక్, పైపులైన్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి ఇంటికి ఉచితంగా కొళాయిని అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తరేషన్‌కార్డులు, పింఛన్‌లు, హౌసింగ్ ఇళ్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాని ప్రజలను కోరారు. గ్రామంలో మరుగుదొడ్లులు లేవని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు స్పందించిన ఆయన త్వరలో మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వరాచారి, బడేసాబ్, సీఎం హనుమంతు, బీటీ శ్రీనివాసులు, సూర్యప్రసాద్, ఎంపీడీవో స్వర్ణమంజరి, సీఐ గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఏఈ శివశంకర్, ఏవో హేమలత, విద్యుత్ ఏఈ సుధాకర్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరుకున్న కార్మికుల సమ్మె


నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మూడో రోజు శనివారం సమ్మె చేపట్టారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్ళి నినాదాలతో నిరసన వ్యక్తం చేసి కార్యాలయం ఎదుట సమ్మె చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, నరసప్ప, విజయ్‌కుమార్,శ్రీరాములు, బాలాజి, పంపాపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి ఫారం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన కడివెళ్ల గ్రామానికి చెందిన నరసప్ప కుటుంబ సభ్యులతో కలిసి వెంకటాపురం వెళ్తుండగా బనవాసి ఫారం సమీపంలో వెళ్తున్న బస్సును నరసప్ప తన స్కూటర్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరసప్పతో పాటు తన కుమారుడికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గుండె పరీక్షలు


ఆర్టీసీ వారు ప్రదానం చేసిన మెమెంటోలతో రోటరీ క్లబ్ మెంబర్లు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లకు గుండె పరీక్షలు నిర్వహించారు. ఎమ్మిగనూరు పట్టణంలో ఆర్టీసీడిపోలో ఆర్టీసీ కార్మికులకు డాక్టర్ సందీప్ కుమార్,డాక్టర్ మనోజ్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు నటరాజ్ రెడ్డి, డాక్టర్ గౌడప్ప గౌడ్ మాట్లాడుతూ శిబిరంలో 165 మంది గుండె పరీక్షలు,120 మంది ఈసీజీ సేవలు,80మంది కార్డియాలజి పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమం తరువాత ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ రోటరీ క్లబ్ మెంబర్స్‌కు మెమెంటోలను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో మాచాని శివశంకర్, మాచాని నాగరాజు, మహానంద య్యమాచాని వేంకటేష్, యాపిల్ డయాగ్నోస్టిక్ బీరప్ప పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యనందించాలి

మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మోడల్ స్కూల్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ సెల్ ఫోన్ ప్రభావంతో బాల బాలికలు తమ లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవుతున్నారని అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిష్యత్తు కలుగుతుందని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కళలను నిజం చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో కురవ కార్పొరేషన్, డెవలంప్ మెంట్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ, రాష్ట్ర కురవ సంఘం ఉపాధ్యక్షుడు మద్దిలేటి, ఎంపీడీవో మణిమంజరి, ఎంఈవో లు రామాంజినేయులు, నీలకంఠ, మాజీ ఎంపీపీ హనుమంతు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గౌస్, ఎర్రబాడు శ్రీనివాసులు, మజీ సర్పంచ్ రహంతుల్ల, పిల్లిగుండ్ల రాముడు, కులుమాల చాంద్, నూరహమ్మద్, రంగస్వామినాయుడు, వినోద్ గౌడ్, పిల్లిగుండ్ల కృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ షహనా పర్వీన్, దోమ విమల, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ఇటీవల డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని అందుకు గాను పిల్లలు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని సీఐ గంగాధర్ కోరారు. గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు ఈ సమావేశానికి సీఐ, ఎంపీడీవో మణిమంజరి, ఎంఈవోలు రామాజింనేయులు, నీలకంఠ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాబోయే రోజుల్లో పాఠశాలల అభివృద్ధిలో ఒక విప్లవాత్మకమైన మార్పును చూడబోతున్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మునుపెన్నడు ఏ విద్యాశాఖ మంత్రి చేయని విధంగా మంత్రి నారాలోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతిపాఠశాలలో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు మించి ప్రభుత్వ పాఠశాలలను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు అంజనేయులు, మధుసూదనరాజు, హెచ్ఎం చిత్రలేఖ, రాజారామ్ మెహన్, సావిత్ర బాయి, సిద్దలింగ, సువర్ణ, రంగనాథ్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు ఘనంగా జరిగాయి. బనవాసి గురుకుల పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని తిక్కారెడ్డి ప్రారంభించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థినిలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతు విద్యార్థినులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి సీఐ బీవీ మధుసుదన్‌రావు, ఎస్ఐ శ్రీనివాసులు లు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సామాజ్యం, ఎంఈవో అంజనేయులు, నవోదయ విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ చంద్రయాన్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయ సిబ్బందిపాల్గొన్నారు. అలాగే మండలంలోని సిరాలదొడ్డి, రాళ్లదొడ్డి, కడిమెట్ల, మాస్‌మాన్‌దొడ్డి, గువ్వలదొడ్డి, గుడికల్లు, మసీదుపురం, మల్కాపురం, కె.తిమ్మాపురం, దైవందిన్నె, ఏనుగుబాల తదితర గ్రామాల్లో ఉపాధ్యాయ, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు ఘనంగా జరిగాయి.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని 19వవార్డు మేకల బజారులోని మండల పరిషత్ ప్రాథమిక కన్నడ పాఠశాల (ఎంపీపీకే బీ)లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు ఇంచార్జు బసరుకోడు వీరేంద్ర,కమిటీ చైర్మన్ రాఘవేంద్ర, ఇన్‌చార్జి హెచ్ఎం కె ఎల్లమ్మ, ప్రభావతి,విజయలక్ష్మి,దేవ మణి తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాల, పల్లెపాడు జడ్పీహెచ్ఎస్‌లో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో ఓ కొత్త కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నందవరం: విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులే మార్గ దర్శకులని ఎస్ఐ శ్రీనివాసులు, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంఈవో సుదర్శన్‌రెడ్డి, హెచ్ఎం శివరాం, అన్నారు. మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశాన్ని నిర్వహించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రిన్సిపల్ శైలజ, చైర్మన్ భీమన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సచరిత, డాక్టర్ రేవతి, పరిమళ, ముగతిలో మాజీ జెడ్పీటీసీ ఈరన్నగౌడు, పూలచింతలో టీడీప సర్పంచ్ అక్కామాంబదేవి, బండేగురుస్వామి, ధర్మపురంలో గోపాల్, మాచాపురంలో కాశీంవలీ, వలీ, నదికైరవాడిలో నదికైరవాడి కురవ వీరేష్, పెద్దకొత్తిలిలో ఆదిశేషు, నాగలదిన్నెలో మాజీ సర్పంచ్ టీ ఈరన్న, సోమలగూడురులో వెంకట్రామిరెడ్డి, చంద్ర, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రాలయం: పాఠశాలలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములుగా చేస్తేనే సాధ్యమవుతుందని మంత్రాలయం సీఐ రామాంజులు, ఎంఈవో షైనుద్దీన్, రాగన్న, హెచ్ఎంలు అంపయ్య, బోజరాజు, లచ్చప్ప, శాంతి, శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని మాధవరం, మంత్రాలయం, సూగూరు, వగరూరు, చిలకలడోన, కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్, తుంగభద్ర, రాంపురం, రచ్చుమర్రి, మాలపల్లి తదితర పాఠశాలల్లో మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశాన్ని అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రంలో మొదటి సారి ఎంపిక చేసిన పాఠశాలలకు తల్లిదండ్రులను ఆహ్వానించి వారి చేత పాఠశాలల ప్రాంగణాల్లో ముగ్గుల పోటీలు, తాడు లాగడం, కబడ్డీ, మ్యూజికల్ చైర్స్ పలు క్రీడా పోటలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, వరదరాజులు, ఎంపీటీసీ మేకల వెంకటేశ్‌లు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్, వీరేష్, గురురాజు, జాన్సన్, షఫీ, విజయకుమార్, ప్రసాద్, సత్యనారాయణ, విఠోభరావు, రామన్న, చంద్రశేఖర్, గోపాల్, బసవరాజు, వీరన్న, ప్రసన్న కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: పెద్దకడబూరు, దొడ్డిమేకల, ముచ్చిగిరి, మురవణితో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా పేరెంట్స్- టీచర్స్ డే సమావేశాన్ని అయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగెస్‌కార్డులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనాథ్, ఎంపీపీ శ్రీవిద్య, సర్పంచ్ రామాంజినేయులు, ఎంపీడీవో జయరాముడు,యంఈవో రాంమూర్తి, ఏపిజీబీ మేనేజర్ రంగప్ప, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉమారాజేశ్వరమ్మ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రంగన్న, వైసీపి మండల కన్వీనర్ రాంమోహన్ రెడ్డి, టీడీపీ నాయకులు మల్లికార్జున, మీసేవ అంజినేయులు,పీఎంసీ చైర్మన్ స్వామిరాజు, తలారి అంజి, విధ్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


బనవాసి గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


టగ్ ఆఫ్ వార్‌లో పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు


నందవరంలో మాట్లాడుతున్న ఎస్ఐ


మంత్రాలయం ఉన్నత పాఠశాలలో పాల్గొన్న సీఐ రామాంజులు, ఎంఈవో రాగన్న, హెచ్ఎం అంపయ్య


గురుకుల పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు


మాట్లాడుతున్న సీఐ గంగాధర్

స్వర్ణ రథంపై విహరించిన ప్రహ్లాదరాయలు


స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. శనివారం షష్టి శుభదినంను పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో భాగంగా ఉత్సవ మూర్తిని ఊయలలో ఉంచి ఊరేగించారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థం వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో మంత్రాలయం కిటకిటలాడింది. మధ్వమార్గ్ కారిడార్, శ్రీమఠం ప్రాంగాణం, అన్నపూర్ణ భోజనశాల, నదితీరం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో భక్తుల సందడిగా మారింది.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం


స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న ఆలయ పండితులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ శివారులోని కోసిగి రోడ్డులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, కుసుమార్చనను నిర్వహించారు. అనంతరం అశేషభక్తజనుల మధ్య వేదపండితులు, ఋగ్వేద పురోహితులు విష్ణువర్ధన శాస్త్రి, శివమణి శాస్త్రి, శంకరమణిలచే స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం ధర్మకర్త కేశవర్ధన, ప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకొని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శనివారం భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు నిర్వహించారు. నగర శివారు విజ్ఞానపీఠంలో జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో విజ్ఞాన పీఠం అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణయ్య, వీహెచ్‌పీ నాయకులు మాణిక్యరెడ్డి, మద్దిలేటి, నాగరాజు, రాధిక, చంద్రమోహన్, మాధవస్వామి, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఊరేగింపు

పెద్దకడుబూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో ఈర్లపాటి ఆంజనేయ స్వామి విగ్రహ ఊరేగింపును శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్తీక మాస పూజ పండుగ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి విగ్రహాన్ని అశేష భక్త జనుల మధ్య ఊరేగించారు. స్వామిని దర్శించుకొని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నారాయణగౌడు, మధు, అయ్యప్ప పాల్గొన్నారు.

అభివృద్ధికి చర్యలు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉద్యాన వన స్థలాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం 19వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో కమిషనర్ పర్యటించారు. ధనలక్ష్మీనగర్, రాంప్రియనగర్, ప్రశాంతినగర్ కాలనీ ల్లోని పార్కుల్లో అభివృద్ధికి ప్రతిపాదన లు రూపొందించాలని కమిషనర్ ఆదేశించారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డీఈఈలు, ఏఈ పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం

మంత్రాలయం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరంలో వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అదే విదంగా మాలపల్లిలో ఆంజనేయస్వామి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం కార్తీక పూజల్లో భాగంగా రెండు గ్రామాల్లో పెద్ద ఎత్తున రథోత్సవాలపై ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి గ్రామ పురవీదుల గుండా ఊరేగించారు. ఉదయం నుంచి వీరభద్రస్వామికి, ఆంజనేయస్వామికి అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, టీడీపీ అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, గువ్వలభీమన్న, నర్సన్న ఆచారి, చంద్ర పాల్గొన్నారు.

కందిపప్పు, పంచదార నొక్కేశారు

రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్‌పై గ్రామస్థుల ఫిర్యాదు


ఆర్ఐకి వినతి పత్రం ఇస్తున్న కోల్‌మాన్‌పేట గ్రామస్థులు

కోసిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోల్‌మాన్‌పేట గ్రామంలో రేషన్ డీలర్ మారెప్ప, ఎండీయూ ఆపరేటర్ రవి కార్డుదారులతో మిషన్‌లో నాలుగు సరుకులకు బయోమెట్రీ వేయించుకుని బియ్యం, జొన్నలు మాత్రమే పంపిణీ చేశారని, కందిపప్పు, చక్కెర డీలర్ మారెప్ప తన ఇంట్లో నిల్వ చేసుకున్నాడని గ్రామస్థులు, కార్డుదారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరితో పాటు టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మదిరి వీరారెడ్డి, అంజనేయులు, హనుమంతు, గోవిందుతో పాటు మరో 50 మంది లిఖిత పూర్వకంగా ఆర్ఐ శ్రీరాములుకు, వీఆర్వో శ్రీనివాసులకు అందజేశారు. ఆర్ఐ శ్రీరాములు గ్రామంలోని రేషన్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించి డీలర్ మారెప్ప ఇంటి దగ్గర విచారణ జరిపారు. విచారణ నివేదికను తహసీల్దార్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుద్దాం: కలెక్టర్


విరాళం అందజేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యుద్ధంలో మరణించిన అమరవీరులు, మాజీ సైనికుల కుటుంబాలకు అండగా నిలుద్దామని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. శనివారం సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఫ్లాగ్ డే ఫండ్ కోసం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరవీరుల గౌరవార్థం ప్రతి ఏటా డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తారన్నారు. కన్న వారికి, ఉన్నవారికి దూరంగా ఉంటూ మాతృభూమి రక్షణకు నిరంతరం సేవలందించేది సైనికులే అని అన్నారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ఆర్ రత్నరూత్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం



మట్లాడుతున్న 6వ అదనపు న్యాయాధికారి పి. పాండురంగారెడ్డి

కర్నూలు లీగల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు, న్యాయవాదులు, మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తే సత్వర న్యాయం పొందవచ్చని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి పి. పాండురంగారెడ్డి తెలియజేశారు. స్థానిక న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ భవనంలో మధ్యవర్తిత్వంపై ఒక ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో అనేక లాభాలు ఉన్నాయని, కక్షిదారులు, న్యాయవాదులు ఈ మధ్యవర్తిత్వాన్ని అంగీకరిస్తే.. పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మధ్యవర్తిత్వం, విధి విధానాల గురించి న్యాయవాదులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మధ్య వర్తిత్వం అనేది ఉభయ పార్టీలకు ఆమోద యోగ్యమైన ఒక విధానమని, కక్షిదారులు మధ్య వర్తిత్వాన్ని ఆశ్రయిస్తే ఖర్చు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ పాల్గొన్నారు.

19న కాంట్రాక్టు ఉద్యోగుల మహాసభ

- కరపత్రాలు విడుదల చేసిన రాష్ట్ర నాయకులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ 6వ రాష్ట్ర సభను ఈ నెల 19న విజయవాడలో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మునెప్ప, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.మనోహర్ మానిక్యం తెలిపారు. శనివారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని యూనియన్ ఆఫీసులో వారు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బోధనాసుపత్రులు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో పని చేసే శానిటేషన్ సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో జరిగే యూనియన్ రాష్ట్ర మహాసభలో భవిష్యత్ నిర్ణయాలను ప్రకటిస్తామన్నారు. మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సెక్యూరిటీ గార్డ్, శానిటేషన్, యూనియన్ నాయకులు రాజు,సురేష్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రలో మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం రైలు నుంచి కిందపడిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభించింది. రైల్వే ఎస్ఐ కిరణ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న గుంటూరు నుంచి కాచిగూడకు వెళ్లిన రైలులో ప్రయాణించిన గుర్తుతెలియని వ్యక్తి తుంగభద్ర నదిలో పడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పోలీసులు మృతదేహం కోసం గాలించగా శనివారం బయట పడింది. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి శరీరంపై ఎరుపు రంగు చొక్క, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు.

స్నాతకోత్సవానికి గవర్నర్ రాక

- ఫిబ్రవరి 8న కార్యక్రమానికి ఏర్పాట్లు
- క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్



మాట్లాడుతున్న క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి

కర్నూలు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 8న నిర్వహించనున్న మొదటి స్నాతకోత్సవానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్నాతకో త్సవానికి సంబంధించి జనవరి 8లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవా లని కోరారు. 2021-22 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 770 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరికి ఇప్పటికే సమాచారం అందించామన్నారు. వర్సిటీ వెబ్ సైట్‌లో వివరాలు తెలుసుకోవాలని సూచించారు. స్నాతకోత్సవ సదస్సులో గవర్నర్ సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డు, గోల్డ్ మెడల్, పారితోషికం వంటివి ప్రోత్సాహకాలుగా అందజేయడానికి దాతలు, విద్యావేత్తలు, పూర్వవిద్యార్థులు, వివిధ సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఓఎస్‌డీ డాక్టర్ ఎస్ఎం బాషా, పీఆర్‌వో డాక్టర్ పార్వతి దేవి, ఏపీఆర్‌వో డాక్టర్ వింద్యా వాసిని పాల్గొన్నారు.





ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలి

సి.బెళగల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. శనివారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చునని అన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు, రైతులు పాలొన్నారు.

11న భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గీతాజయంతిని పురస్కరించుకొని నగరంలోని స్వామి విద్యాప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న వెయ్యి మంది భక్తులతో భగవద్గీత సహస్ర గళ పారాయణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోగల గీతా ప్రచార ధామం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హాజరవుతారని తెలిపారు. అలాగే హైదరాబాదుకు చెందిన ధార్మికవేత్త వీఎస్ఆర్ మూర్తి, చిన్మయ మిషన్ ఇన్‌చార్జి మాతా సుప్రేమానంద సరస్వతి పాల్గొంటారని ఆయన తెలిపారు.

డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు

సి.బెళగల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణం డీలర్లు అక్ర మాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. సి.బెళగల్, చింతమానుపల్లె, పలుకుదొడ్డి, కంబం ధహల్, తిమ్మనదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని బియ్యం కార్డుదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందజేయడం లేదని లబ్ధిదారులు తహసీల్దార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. డీలర్లు నిత్యావసర సరుకులు సక్రమంగా అందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

























